క్లుప్తంగా

పేదలకు చీరల పంపిణీ



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భారతీయ అంతరిక్ష తొలి వ్యోయగామి రాకేష్ శర్మ 75వ పుట్టిన రోజును పురస్కరించుకుని శనివారం పేదలకు చీరల పంపిణీ జరిగింది. కేఎల్ రావునగర్‌లోని రాకేష్ పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ ఎస్వీ రావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు లాంగ్ లీవ్ రాకేష్ శర్మ అంటూ నినాదాలు చేశారు. దేశంలోనే తొలి అంతరిక్ష వ్యోయగామి రాకేష్ శర్మ ఆనాటి సాంకేతికత పరిజ్ఞానానికి చిహ్నమని, రాకేష్ శర్మ నిడారంబరత, దేశానికి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం విద్యార్థులకు బిస్కెట్లు, పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రేణుకాదేవి, స్కూల్ ఉపాధ్యాయులు మల్లేశ్వరి, మహారాజ్, మమత, షకీలా, ధనలక్ష్మి, చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఇద్దరిని కొత్తపేట పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 39 క్వార్టర్ బాటిల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాత రాజరాజేశ్వరిపేటలో ఓ మహిళ మద్యం విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు పేటలో తనిఖీ నిర్వహించగా, కోలా సరోజిని అనే మహిళ మద్యం విక్రయిస్తున్నట్లు తెలిసింది. దీంతో ఆమెను అరెస్ట్ చేసి 9 క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. ఇక వైఎస్సార్ కాలనీలో మద్యం విక్రయిస్తున్న కొణదల సుబ్బారావు అనే వ్యక్తిని అరెస్ట్ చేసి 30 క్వార్టర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

పశ్చిమలో గెలుపును జగనన్నకు బహుమతిగా అందిద్దాం



షేక్ ఆసిఫ్‌ను సత్కరిస్తున్న కార్పొరేటర్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రానున్న ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలుపును ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి బహుమతిగా అందిద్దామని ఆ పార్టీ స్థానిక నియోజకవర్గ సమన్వయకర్త, ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్ అన్నారు. నూతనంగా సమన్వయకర్తగా నియమితుడైన షేక్ ఆసిఫ్‌కు స్థానిక కార్పొరేటర్లందరూ సంపూర్ణంగా సంఘీభావం తెలిపారు. రానున్న ఎన్నికలల్లో అందరూ కలిసికట్టుగా పని చేసి విజయాన్ని సాధిద్దామని పేర్కొన్నారు. అనంతరం అందరూ కలిసి ఆసిఫ్‌ను సత్కరించారు. స్థానిక శాసన సభ్యుడు వెలంపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన పశ్చిమ నియోజకవర్గంలోని పార్టీకి చెందిన కార్పొరేటర్ల సమావేశం వెలంపల్లి కార్యాలయంలో శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ.. ఆసిఫ్‌ను పార్టీ సమన్వయకర్తగా నియమించిందన్నారు. అలాగే రానున్న ఎన్నికల్లో ఆసిఫ్‌ను గెలిపించాల్సిన బాధ్యత కార్పొరేటర్లందరూ తీసుకోవాలని సూచించారు. పార్టీ గెలుపునకు అందరూ కలిసికట్టుగా పాటుపడాలన్నారు. ఆసిఫ్‌కు పూర్తి మద్దతు ఇవ్వాలని సూచించారు.

అందరి సహకారంతో ముందుకు..

అనంతరం షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో సమన్వయకర్తగా నియమింపబడ్డానన్నారు. అందరి సహకారంతో ముందుకు సాగుతానని చెప్పారు. తాను గతంలో కార్పొరేటర్‌గా పని చేశానని గుర్తు చేశారు. వెలంపల్లి శ్రీనివాసరావు నాయకత్వంలో నియోజకవర్గంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అద్భుతమైన అభివృద్ధిని చేసిందన్నారు. ప్రజలందరూ పార్టీకి అండగా ఉన్నారన్నారు. అలాగే కార్పొరేటర్లందరూ తనకు అండగా ఉండి నడిపించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపు రాష్ట్ర ప్రజలకు చాలా అవసరమని వివరించారు. కార్పొరేటర్లందరూ ముక్తకంఠంతో మద్దతు పలికారు. కార్పొరేటర్లు బుల్లా విజయ్ కుమార్, బండి నాగేంద్ర పుణ్యశీల, పి.చైతన్యరెడ్డి, రెహ్మతున్నిసా, ఇర్ఫాన్, నరేంద్ర, మరుపిళ్ల రాజేష్, మహాదేవు అప్పాజీ, ఆంజనేయరెడ్డి, కోటిరెడ్డి, చలపతిరావు, ఆర్షద్, నాయకులు రాయన నరేంద్ర, మైలవరపు దుర్గారావు, అత్తులూరి పెద్దబాబు, బంక విజయ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శ్రీవారి కల్యాణం



విశేష అలంకరణలో స్వామి వారు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం శనివారం వైభవంగా జరిగింది. బ్రాహ్మణవీధిలో దేవదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని పురాతన ఆలయాల్లో ఒకటైన శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో స్వామి వారి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామి వారికి శాంతి కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ధనుర్మాసం, అందులోనూ స్వామి వారికి ప్రీతికరమైన శనివారం శ్రవణ నక్షత్రం కావటంతో అత్యంత పవిత్రమైనదిగా భావించి భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని శ్రీకృష్ణ మండపంలో స్వామి వారి ఉత్సవమూర్తులను మేళతాళాలతో తీసుకువచ్చి కల్యాణ వేదికపై వేంచేయించారు. అనంతరం ఆలయ అర్చక స్వాములు పి.రామచంద్రమూర్తి పర్యవేక్షణలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. తొలుత విష్వక్సేన పూజతో కల్యాణోత్సవానికి శ్రీకారం చుట్టారు. అనంతరం మహాసంకల్పం, ప్రవర, యజ్ఞపవీతధారణ, జీలకర్ర బెల్లం ధారణ, మంగళ్యధారణ, చివరిగా తలంబ్రాల సమర్పణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా తిరుమంజనం

స్వామి వారి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆలయంలోని స్వామి వారి మూలవిరాట్ కు తిరుమంజన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. వివిధ ఫల, సుగంధ ద్రవ్యాలతో, పంచామృతాలతో స్వామి వారిని అభిషేకించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక అలంకారం చేశారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. వైదిక కార్యక్రమాలను కార్యనిర్వహణాధికారి ఘంటసాల శ్రీనివాస్ పర్యవేక్షించారు.

పోలవరం ప్రాజెక్ట్‌లో చంద్రబాబు అవినీతిపై సీబీఐ విచారణ చేయాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంలో అవినీతికి పాల్పడ్డ చంద్రబాబు, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావులపై సీబీఐ విచారణ చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు ఆకుల శ్రీనివాస్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం భవానీపురంలోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ పాలనలో పోలవరం, పట్టిసీమ ప్రాజెక్ట్ పనుల్లో కోట్లాది రూపాయలు చంద్రబాబు కుటుంబ సభ్యులు దోచుకున్నారన్నారు. ట్రాన్స్‌ట్రాయ్ కంపెనీ అధినేత, టీడీపీ నాయకులు రాయపాటి రంగారావు చేసిన వ్యాఖ్యల ఆధారంగా సీబీఐ విచారణ చేపట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ మునిగిపోయే పడవ అని గ్రహించిన నేతలు ఆ పార్టీలో నుంచి బయటకు వచ్చేశారని తెలిపారు. మరోసారి జగన్‌ను సీఎంను చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. నాయకులు పాదిలి చంటిబాబు, ఏలూరు వెంకన్న, ఎం.వెంగళరెడ్డి, దూబ తిరుపతి నాయుడు పాల్గొన్నారు.

కనులపండువగా తోటోత్సవం



నృత్యం చేస్తున్న కళాకారిణులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గోదా, రంగనాథుల తోటోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. చిట్టినగర్‌లోని శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దేవస్థాన ఆవరణలోని ఆస్థాన కళ్యాణ మండపంలో నిర్వహించిన తోటోత్సవంలో శారదా నృత్య కళా పీఠంకు చెందిన పలువురు చిన్నారులు గోదా వైభవం నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. అనంతరం వేదికపై ఏర్పాటు చేసిన ఉత్సవ మూర్తులకు ఆలయ కమిటీ పాలక వర్గ సభ్యులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ అర్చకులు వినుకొండ రామరత్నమాచార్యులు గోదా, రంగనాథ స్వాములకు పూజా కార్యక్రమాలను జరిపారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని శనివారం ఉదయం స్వామి వారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారికి సుప్రభాత సేవ అనంతరం పంచామృత అభిషేకాలు నిర్వహించగా పలువురు ఉభయ దాతలు, భక్తులు తరలివచ్చారు. స్వామి వారికి తులసీ దళాలను సమర్పించిన భక్తులు పూజలు జరిపించుకున్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణను జయప్రదం చేయాలి



అంబేడ్కర్ చిత్రపటాలను ప్రదర్శిస్తున్న శరత్‌బాబు

పాయకాపురం(విజయవాడరూరల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఈ నెల 19వ తేదీన ప్రారంభించనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు పోలిమెట్ల శరత్‌బాబు పేర్కొన్నారు. 62వ డివిజన్ ఎల్‌బీఎస్ నగర్‌లోని మూడుబొమ్మల సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి స్థానిక కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మీతో కలిసి శనివారం ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ నగరం నడిబడ్డున 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని రూ. 404 కోట్లతో దేశంలో ఎక్కడా లేనివిధంగా ఏర్పాటు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని అన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను ఏకతాటిపై నడిపిస్తున్న సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా ఆవిష్కరించనున్న ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావాలని కోరారు. అనంతరం అంబేడ్కర్ చిత్రపటాలను స్థానికులతో కలిసి ప్రదర్శించారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



నగదు అందజేస్తున్న కార్పొరేటర్ గోదావరి గంగ

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక 47వ డివిజన్ 151వ వార్డు సచివాలయం పరిధిలోని కొండ ప్రాంతంలో నివసిస్తున్న అమరవరపు విమల ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వైఎస్సార్ బీమా పథకంలో ఆమె పేరు నమోదు కావడంతో వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద మట్టి ఖర్చులకు రూ.10 వేలు నగదును మృతురాలి కుటుంబసభ్యులకు స్థానిక కార్పొరేటర్ గోదావరి గంగ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా మంజూరయ్యే మిగతా నగదును త్వరలో నామినీ బ్యాంక్ ఖాతాలో జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తాండ్ర ఇంద్రకుమార్, రెడపంగు క్రాంతి, సచివాలయ అడ్మిన్ రాజీవ్, వలంటీర్ పార్వతి పాల్గొన్నారు.

సందడిగా సంక్రాంతి సంబరాలు



కేబీఎన్ కళాశాలలో భోగి మంట వెలిగిస్తున్న ప్రిన్సిపాల్ నారాయణరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేబీఎన్ కళాశాలలో శనివారం సంక్రాంతి సంబరాలు సందడిగా జరిగాయి. రెండు రోజుల పాటు జరిగిన వేడుకల్లో సిబ్బంది, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. భోగి మంటలు, గంగిరెద్దుల విన్యాసాలు, భోగిపండ్లు పోయించుకున్న చిన్నారుల హడావుడి, హరిదాసుల హరినామ స్మరణలు, విద్యార్థినుల కోలాట విన్యాసాలతో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకాయి. రెండో రోజు వేడుకలను కళాశాల పాలకవర్గ కోశాధికారి అన్నం రామకృష్ణారావు ప్రారంభించారు. కళాశాల ఉమెన్స్ స్టడ్ సెంటర్, ఇన్నర్‌వీల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో సందడిగా నిర్వహించారు. తొలుత చిన్నారులకు భోగి పండ్లు పోసి అందరూ ఆశీస్సులందించారు. అదేవిధంగా పండితులు సైతం వేద ఆశీస్సులను అందించారు. అక్కడి నుంచి గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. బసవన్నలతో గంగిరెద్దుల కళాకారులు తమ వాయిద్యాలతో పాటలు పాడుతూ వాటితో పలు ఆటలు ఆడించారు. హరిదాసు సందడి చేశారు.

భారతీయ సంస్కృతిలో భాగం

ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు భోగి మంటలను వెలిగించారు. విద్యార్థినులు కోలాట విన్యాసాలతో ఆకట్టుకున్నారు. అలాగే భోగి మంటల వద్ద సందడి చేశారు. సంప్రదాయ వస్త్రధారణ పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పోటీపడ్డారు. అదేవిధంగా విద్యార్థులు పిండివంటలతో అలరించారు. కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలు భారతీయ సంస్కృతిలో భాగమన్నారు. వీటిపై అందరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమాలను స్టడీ సెంటర్ కన్వీనర్ వి.శైలజ, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ జి.కృష్ణవేణి నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, ఇన్నర్‌వీల్ క్లబ్ కన్వీనర్లు కరీంబీర్‌కౌర్, శ్రీదేవి పాల్గొన్నారు.

దివ్యాంగులకు సేవలందించటం అభినందనీయం



చిన్నారులతో కార్పొరేటర్ నరేంద్ర రాఘవ

భవానీపురం(విజయవాడపశ్చిమ): మానసికంగా బుద్ధి మాంద్యం కలిగిన దివ్యాంగులకు సేవలందించి వారిని మామూలు మనుషులుగా తీర్చిదిద్దటం అభినందనీయమని 39వ డివిజన్ కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ అన్నారు. విద్యాధరపురం ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్‌లోని ఆర్‌కె పబ్లిక్ స్కూల్ సమీపంలో గల భవిత స్పెషల్ నీడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో శనివారం నిర్వహించిన సంక్రాంతి సంబరాల వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సెంటర్‌లోని పిల్లలకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. నరేంద్ర రాఘవ మాట్లాడుతూ.. బుద్ధి మాంద్యం కలిగిన పిల్లల కోసం స్కూల్ ఏర్పాటు చేసి వారికి విద్యా బుద్ధులు నేర్పటం అంటే ఎంతో ఓర్పు, సహనంతో పాటు వారిపట్ల ప్రేమ కలిగి ఉండాలన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ జె.సునీత మాట్లాడుతూ.. పిల్లల్లో ఉత్సాహం నింపేందుకు ప్రతి పండుగకు వేడుకలను నిర్వహిస్తున్నామని తెలిపారు. సెంటర్‌లో స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ, ఆక్యుపేషన్ థెరపీ తదితర సేవలను అందిస్తున్నామన్నారు. గట్టు వెనుక ప్రాంతంలో మానసికంగా బలహీనంగా ఉన్న విద్యార్థులను సెంటర్‌లో చేర్పించేందుకు 99859 51397 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వివాహితను వేధిస్తున్న యువకులపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహితను వేధింపులకు గురి చేస్తున్న ఇద్దరు యువకులపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ రూరల్ మండలం అంబాపురంలో పిట్ల సుగుణ తన భర్త, ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటుంది. సుగుణ కుమారుడు నగరంలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో పని చేస్తుండేవాడు. అదే కంపెనీలో పని చేసే గుంటూరుకు చెందిన శ్రీకాంత్, కృష్ణలంకకు చెందిన విజయ్‌లు అప్పుడప్పుడు సుగుణ ఇంటికి వచ్చేవారు. ఆ క్రమంలో సుగుణ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా అశ్లీల వీడియోలు చూడాలని బలవంతం చేసేవారు. తమకు సహకరిస్తే సుగుణ అబ్బాయికి ప్రమోషన్ వచ్చేలా చేస్తామని చెప్పి వేధింపులకు గురి చేసేవారు. ఈ విషయాన్ని ఆమె తన కుమారుడికి చెప్పి, ఉద్యోగం మానేయాలని సూచించింది. ఈ విషయం బయట ఎవరికైనా చెబితే మీ సంగతి చూస్తామని చెప్పి బెదిరింపులకు దిగడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు.

జిల్లా వాణిజ్య కేంద్రంగా వన్‌టౌన్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఉమ్మడి కృష్ణాజిల్లా వాణిజ్య కేంద్రంగా ప్రసిద్ధి చెందిన విజయవాడ వన్‌టౌన్ విరాజిల్లుతుంది. ముఖ్యంగా వర్తక, వ్యాపార కేంద్రాలన్నీ ఇక్కడే కేంద్రీకృతం కావడంతో జిల్లాలోని ప్రజలతో పాటు చిరు వ్యాపారులందరూ ప్రతి రోజూ వన్‌టౌన్‌కు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రధానంగా వస్త్ర వ్యాపారంతో పాటు జ్యువెలరీ షాపులు కూడా ఇక్కడే ఉండటంతో ఎల్లప్పుడూ కొనుగోలుదారులతో రద్దీ ఉంటుంది. వస్త్రలత, కృష్ణవేణి కాంప్లెక్స్ వస్త్ర వ్యాపారానికి పెట్టింది పేరు. అలాగే వన్‌టౌన్ శివాలయం వీధిలో ఎక్కువ సంఖ్యలో ఉన్న బంగారం, వెండి షాపులు ప్రతి రోజు కళకళలాడుతుంటాయి. ఇక అన్ని రకాల కూరగాయలు, కిరాణా సరుకులు లభించే కాళేశ్వరరావు మార్కెట్ ఎప్పుడు చూసినా రద్దీగానే ఉంటుంది. హెడ్ పోస్టాఫీస్, ప్రముఖ విద్యా సంస్థలు, వివిధ బ్యాంకులు, ట్రాక్టర్లు, పలు వాహనాలకు సంబంధించిన డిస్పోజల్ స్పేర్ పార్ట్స్ షాపులు వన్‌టౌన్‌లో నెలకొని ఉన్నాయి. పాత శివాలయం ఏరియాలో గృహోపకరణాల షాపులు కోకొల్లలుగా ఉన్నాయి. పాతవి మార్చుకోవాలన్నా, కొత్తవి కొనుగోలు చేయాలన్నా ఇదే కేంద్రంగా నిలిచింది. ఇక ఆధ్యాత్మిక పరంగా చూస్తే ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మ, దిగువున విజయేశ్వరస్వామి దేవాలయం, బ్రాహ్మణ వీధిలో వెంకటేశ్వరస్వామి దేవస్థానం తదితర అనేక దేవాలయాలు ఉన్నాయి. ఏ వస్తువు దొరకాలన్నా వన్‌టౌన్‌లోనే అన్నది నానుడిగా మారిపోయింది.

బీసెంట్ రోడ్‌ను తలపిస్తున్న స్వాతి రోడ్

పూర్వం నుంచి గట్టు వెనుక ప్రాంతంగా పిలువబడే భవానీపురం, విద్యాధరపురం ప్రాంతాలు ఈ రోజు నగరంలో నిత్యం రద్దీగా ఉండే బీసెంట్ రోడ్‌ను తలపిస్తున్నాయి. ముఖ్యంగా భవానీపురం స్వాతి రోడ్‌లో అన్ని రకాల జాతీయ బ్యాంక్‌లతో పాటు ఎలక్ట్రానిక్ షాపులు, రిలయన్స్, మోడరన్ మార్ట్‌లు, హాస్పటల్స్‌కు కొదవ లేదు. ఇక భవానీపురంలో ఉన్న ఐరన్ మార్కెట్‌లో ఐరన్ అండ్ హార్డ్‌వేర్‌కు ప్రసిద్ధి చెందింది. ఇతర ప్రాంతాల నుంచి సాధారణ ప్రజలతో పాటు ఐరన్ వ్యాపారులుకూడా ఇక్కడికే వచ్చి హోల్‌సేల్‌గా కొనుగోలు చేస్తుంటారు. సాయంత్రం వేళల్లో స్వాతి రోడ్ ఫుడ్ కోర్ట్‌ను తలపిస్తుంది. విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే 65వ నెంబర్ జాతీయ రహదారికి గొల్లపూడి బైపాస్ రహదారికి మధ్య ఉన్న భవానీపురం ప్రాంతం మొత్తం వ్యాపార కేంద్రంగా తయారయ్యింది.

అందుబాటులో వైద్య సదుపాయాలు



భవానీపురం స్వాతి రోడ్‌లో ఇటీవల నూతనంగా నిర్మించిన భవనంలో నెలకొల్పిన బాలాజీ హాస్పిటల్స్ అండ్ డయాబెటిస్ సెంటర్‌లో అత్యాధునిక వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచాం. ల్యాబ్ సౌకర్యంతో పాటు సుశిక్షితులైన వైద్య సిబ్బందితో 50 పడకలతో హాస్పిటల్‌ను తీర్చిదిద్దాం. మారుతున్న కాలంలో ఆహార, వ్యవహారాల కారణంగా అత్యధిక శాతం మందిలో డయాబెటిస్ ఉంది. దానిని క్రమబద్ధీకరించేందుకు ప్రత్యేక వైద్యాన్ని అందిస్తున్నాం.
– డాక్టర్ ఆర్ఎల్‌వీ ఫణికుమార్, డయాబెటిక్ వైద్య నిపుణులు

సిప్ అబాకస్‌లో ఉత్తమ శిక్షణ



అంతర్జాతీయంగా గుర్తింపు కలిగిన సిప్ అబాకస్ కోచింగ్ ఇనిస్టిట్యూట్ బ్రాంచిలను వన్‌టౌన్, భవానీపురం ప్రాంతాల్లో ప్రారంభించి అబాకస్ కోచింగ్‌లో అగ్రభాగాన నిలిచాం. ఎంతో మంది సాధారణ విద్యార్థులను 5 రెట్లకుపైగా మెరుగైన ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నాం. చిన్నారుల తల్లిదండ్రుల ఆదరాభిమానాలు, అభినందనలతో విజయవంతంగా 17వ సంవత్సరంలోకి అడుగుపెట్టాం. మా విద్యార్థులు ఉత్త మ ప్రతిభ కనబరిచి ప్రముఖ స్థానాల్లో నిలబడటం గర్వకారణంగా ఉంది. – మధుసూదనరావు, సిప్ అబాకస్ సెంటర్ హెడ్

సాయి ప్రజ్ఞకు ఆత్మీయ సత్కారం

విజయవాడకల్చరల్: బహుముఖ ప్రతిభాశాలి సాయి ప్రజ్ఞ అని బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణ మూర్తి అన్నారు. డ్రీమ్ ఆడియో ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం సంగీత కళాకారిణి సాయి ప్రజ్ఞకు ఆత్మీయ సత్కారం, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బలరామకృష్ణమూర్తి మాట్లాడుతూ సాయి ప్రజ్ఞ బాల్యం నుంచే శాస్త్రీయ సంగీతంలో ప్రతిభను కనబర్చారన్నారు. డ్రీమ్ ఆడియో అధినేత చావా నరసింహారావు మాట్లాడుతూ.. సంస్థ విలువలతో కూడిన కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు. వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు పరచూరి విజయలక్ష్మి, బోడి ఆంజనేయరాజు, కొప్పుల ఆనంద్ ప్రసంగించారు. సాయి ప్రజ్ఞను ఆత్మీయంగా సత్కరించారు. గాయకులు విష్ణు ప్రియ, రూపశ్రీ, జయప్రభు, శ్రీధర్, రాజు, సత్యవర్ధన్, రసూల్ బాబు, దిలీప్ పలు క్లాసికల్ గీతాలను ఆలపించారు.